

అర్జీదారుల సమస్యలు అర్థం చేసుకోవాలి - 8లో

అర్జీదారుల సమస్యలను పరిష్కరించడమే నిజమైన సేవ అని కలెక్టర్ డాక్టర్ బిఆర్అంబే ద్కర్ అన్నారు.



నిరుద్యోగుల నిరీక్షణ - 8లో

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఇంటికో ఉద్యోగం, లేదా నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారు.



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బాల్య వివాహాలు చేయడం నేరమని, చేసిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తారని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

స్వామిత్వతో కచ్చితమైన భూ రికార్డులు



లక్ష్మీపురంలో స్వామిత్వ సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: స్వామిత్వ సర్వేతో కచ్చితమైన భూ రికార్డులను అందించడం జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. పార్వతీపురం మండలం జమదాల పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో అమలవుతున్న స్వామిత్వ యోజన పథకాన్ని సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి మంగళవారం పరిశీలించారు. బందలుప్పి, జమదాల సమీపంలోని చెరువులను కలెక్టర్ పరిశీలించారు. ఎర్రంనాయుడు చెరువు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఆయన వెంట డీపీఓ కొండలరావు, తహసీల్దార్ సురేష్ ఉన్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణ పోలీసులు మంగళవారం బొడ్డవర కూడలిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు లగేజీ బ్యాగ్‌లతో పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 7 ప్యాకెట్లలో 10కిలోల గంజాయి లభించింది. నిందితులు బెంగుళూరు సమీపంలోని తిరుమలశెట్టి గ్రామానికి చెందిన చరనా దారి, పవన్ మంజునాథ్‌లుగా గుర్తించారు. వీరు అరకు నుంచి కర్ణాటక రాష్ట్రానికి గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

పేదల బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్న అధికారులు

మక్కువ: మండలంలోని ఎర్ర సామంతవలస గ్రామం వద్ద మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారుల సంయుక్తంగా దాడిచేసి పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. మక్కువకు చెందిన ఓ వ్యక్తి ఆటోలో ఎర్రసామంతవలస మీదుగా ఒడిశా తరలిస్తున్న 950 కేజీల బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.8లక్షలు చోరీ

- వైద్య ఖర్చుల కోసం దాచిన డబ్బును దోచుకున్న సైబర్ నేరగాళ్లు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని గెంబలి వారి వీధికి చెందిన బరాటం బాలకృష్ణమూర్తి అనే వ్యక్తి బ్యాంకు ఖాతాలో నుంచి అతని ప్రమేయం లేకుండా రూ.8 లక్షలను సైబర్ నేరగాళ్లు తస్కరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ కె.మురళీధర్ కేసు నమోదుచేశారు. వైద్య ఖర్చుల కోసం దాచిన సొమ్మును తీసుకునేందుకు సోమవారం బ్యాంకుకు వెళ్లగా గతనెల 28న తన ఖాతా నుంచి ఆన్‌లైన్‌లో విత్ డ్రా చేసినట్లు బ్యాంక్ అధికారులు తెలిపినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వింతవ్యాధితో లక్షకు పైగా కోళ్లు మృతి

- నమూనాలు విజయవాడ ల్యాబ్‌కు తరలింపు

కొత్తవలస: వింత వ్యాధులతో దేశవాళీ, ఫారం కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు కన్నంనాయుడు మంగళవారం తెలిపారు. కొత్తవలస పశు సంవర్థక శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని కొత్తవలస, లక్కవరపుకోట మండలాల పరిధిలో నేటి వరకు లక్ష వరకు కోళ్ల మృతి చెందినట్టు వెల్లడించారు.

రెండు మండలాల్లో 80కి పైగా కోళ్ల ఫామ్‌లు ఉన్నాయని, గత నెల రోజుల నుంచి వరుసగా కోళ్లు చనిపోవడం ప్రారంభమైందన్నారు. కోళ్లఫామ్‌ల యజమానులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారని, కోళ్లకు సోకిన వ్యాధి నిర్ధారణకు నమూనాలను విజయవాడ ప్రత్యేక ల్యాబ్‌కు పంపించామన్నారు. చనిపోయిన కోళ్లను ఆరుబయట వేయకుండా గొయ్యితీసి పాతిపెట్టాలని సూచించారు. ల్యాబ్ ఫలితాలు వస్తేగాని వ్యాధి నిర్ధారణ చేయలేమన్నారు.



పార్వతీపురం నిరాశ్రయుల భవనంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు



పాలకొండలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మదిమదినా.. మహానేత

- వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి
- పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు

సాక్షి, పార్వతీపురం మన్యం: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనాథాశ్రమాల్లో అన్నదానం, వృద్ధులకు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

- పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో మహానేత వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలిజిపేట, సీతానగరం మండలాల్లోనూ వర్ధంతి కార్యక్రమాలు చేపట్టారు.
- సాలూరు నియోజకవర్గ కేంద్రంలో దివంగత నేత వైఎస్ విగ్రహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు పీడిక రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. మక్కువ, సాలూరు మండలం, మెంటాడ, పాచిపెంట తదితర ప్రాంతాల్లోనూ ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి చేపట్టారు.
- పాలకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో దివంగత నేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల్లోనూ వైఎస్ వర్ధంతి చేపట్టారు.
- కురుపాం నియోజకవర్గంలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస తదితర ప్రాంతాల్లో ఆయా మండలాల నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి మహానేతను స్మరించుకున్నారు.



సాలూరు పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా..?



చిత్రంలో బురదతో అధ్వానంగా మారిన రోడ్డు కురుపాం మండలంలోని ఏగులవాడ పంచాయతీలోని పోరండంగూడ, జోడుమానుగూడ గ్రామాలకు వెళ్లేది. మొండెంఖల్ నుంచి జోడుమానుగూడ గ్రామం వరకు సుమారు 3 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్డు బురద, గోతులతో అధ్వానంగా తయారైంది. రాకపోకలకు గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికే స్థానిక పాలకులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన లేదని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు. - కురుపాం

వట్టిగెడ్డకు వరద తాకిడి



వట్టిగెడ్డలో ప్రవహిస్తున్న వరదనీరు

వీరఘట్టం: వట్టిగెడ్డకు మంగళవారం వరద తాకిడి పెరిగింది. వట్టిగెడ్డ పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు వరదనీరు గెడ్డకు పోటెత్తింది. గెడ్డలో ఉన్న మంచినీళ్ల ట్యాంకు మునిగిపోయింది. గెడ్డ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎ.ఎస్.కామేశ్వరరావు దండోరా వేయించారు. వట్టిగెడ్డకు అనుసంధానంగా ఉన్న రావాడ డ్యామ్‌లో నీటి ప్రవాహం పెరగడంతో గెడ్డలోకి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈ రవికుమార్ తెలిపారు.

అధ్వాన రోడ్లే అభివృద్ధా?



కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను వివరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్న చంద్రబాబు
- రైతన్నల యూరియా కష్టాలు తీర్చని కూటమి
- 19 కేసులున్న అవినీతి సీఎంకు పవన్‌కల్యాణ్ మద్దతివ్వడం హాస్యాస్పదం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజాధనాన్ని ప్రచారాలకు దుర్వినియోగం చేయడం, ప్రతి మంగళవారం అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చడం, అధ్వానంగా కనిపిస్తున్న రోడ్లను బాగుచేయకపోవడమే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి అని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరు పట్టణంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.3,32,000 కోట్లు అప్పులు చేస్తే 14 లక్షల కోట్లు అప్పులు చేసిందంటూ టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేశారని, కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో సుమారు 2 లక్షల కోట్లు అప్పులు చేశారని, దేశంలోనే అతి తక్కువ కాలంలో అత్యధిక అప్పులు తీసుకున్న రాష్ట్రంగా ఆంధ్రాను మార్చేశారన్నారు. ఇదేనా చంద్రబాబు సంపద సృష్టంటూ దుయ్యబట్టారు. కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా పాత పింఛన్ల పంపిణీలో టీడీపీ నేతలు హడావిడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దివ్యాంగుల పింఛన్లు తొలగింపునకు పూనుకుని వారికి శోకం మిగులుస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, బీసీ, పేదలకు పింఛన్లు ఇస్తామన్న హామీని విస్మరించడం విచారకరమన్నారు. ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి కింద నిరుద్యోగ యువతకు నెలకు ఇస్తామన్న రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.

యూరియా ఏదీ...

'గణపతిబప్పమోరియా... ఏదయ్యా యూరియా' అంటూ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై సోషల్‌మీడియాలో వస్తున్న పోస్టులు ప్రభుత్వ వైఫల్యానికి అద్దంపడుతున్నాయని రాజన్నదొర అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిత్యం వహిస్తున్న కుప్పంలోనే యూరియాకోసం రైతుల అగచాట్లు ప్రభుత్వ పాలనను ఎత్తిచూపుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు ఎరువుకోసం అవస్థలు పడిన దాఖలా లేవన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఎయిర్‌పోర్టులు, సీపోర్టులు, ఆస్పత్రులు, సచివాలయ భవనాలు, విద్యాలయాల నిర్మాణాలు జరిగాయని గుర్తుచేశారు. కూటమి పాలనా వైఫల్యానికి రాష్ట్రంలో అధ్వానంగా దర్శనమిస్తున్న రోడ్లే నిలువెత్తు నిదర్శనమన్నారు. టీడీపీ నేతలు అవినీతిపై ఆ పార్టీ అనుకూల పత్రికలోనే 'వసూళ్ల రాజాలు' శీర్షికన కథనం వచ్చిందని పేర్కొన్నారు. అవినీతిపరుడు ముఖ్యమంత్రిగా ఉండకూడదని పవన్‌కల్యాణ్ చెప్పారని, చంద్రబాబునాయుడిపై 19 కేసులు ఉన్నాయని టీడీపీ అనుకూల పత్రికలోనే కథనం వచ్చిందని, మరి అవినీతిపరుడుకు పవన్‌కల్యాణ్ ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. ప్రశ్నిస్తానని చెప్పిన పవన్‌కల్యాణ్... సుగాలిప్రీతి విషయంలో ఎందుకు మాట తప్పారన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయని ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని ఓ అభిమానిగా తాను అడుగుతున్నానని అన్నారు. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డిల పాలన మధ్య తేడాను ప్రజలు గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

మంచం పట్టిన మన్యం

- జ్వరాలతో ఉక్కిరిబిక్కిరి
- ఆస్పత్రుల్లో చేరుతున్న గిరిజనులు
- చిన్నారులను పట్టిపీడిస్తున్న జ్వరాలు
- కలుషిత నీరు, పారిశుద్ధ్యలోపమే కారణమంటున్న గిరిజనం
- దోమతెరలు పంపిణీ చేయకపోవడంపై ఆందోళన

పార్వతీపురం మన్యం జిల్లాలో మలేరియా కేసుల నమోదు ఇలా...

సంవత్సరం	సేకరించిన రక్తపూతలు	మలేరియా పాజిటివ్ (కేసులు)
2022	220809	24
2023	271903	45
2024	363684	470
2025ఇప్పటి వరకు	1,26,210	195

జియ్యమ్మవలస రూరల్/గుమ్మలక్ష్మీపురం/సీతంపేట

మన్యం ప్రజలపై జ్వరాలు పంజావిసురుతున్నాయి. జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. జియ్యమ్మవలస మండలంలోని గిరిజన గ్రామాలైన వనజ, పెదదోడిజ, పల్లపు సిరిపి, నడిమి సిరిపి, టి.కె.జమ్ము, పిటి మండ తదితర గ్రామాల ప్రజలు జ్వరాలతో మంచంపట్టారు. చాలామంది చినమేరంగి సీహెచ్‌సీలో చేరి వైద్య సేవలు పొందుతున్నారు. జ్వరపీడితుల్లో చిన్నారులే అధికమంది కావడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పల్లెల్లో పారిశుధ్యలోపం, రక్షిత మంచినీరు అందకపోవడం, దోమల నివారణ చర్యలు లేకపోవడంతో జ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయని గిరిజనులు చెబుతున్నారు. ఫీవర్ సర్వే చేపట్టి సకాలంలో వైద్యసేవలు అందించకపోవడంతో ఆస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందాల్సి వస్తోందంటూ వాపోతున్నారు.

- సీతంపేట ఏజెన్సీలోనూ జ్వరాల తాకిడి పెరిగింది. వర్షాలు కురుస్తుండడం, కలుషితమైన తాగునీరును ప్రజలు తాగుతుండడంతో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. జూన్ నుంచి ఎపిడమిక్ సీజన్ ఆరంభమైంది మొదలు పీహెచ్‌సీలు, స్థానిక ఏరియా ఆస్పత్రులు, ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూనే ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటి ఫీవర్ సర్వే జరిగేది. ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందేవి. నిరంతరం వైద్యుల పర్యవేక్షణ ఉండేది. రెండులక్షల దోమతెరలు పంపిణీ చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదని, వైద్య భరోసా కరువైందంటూ రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ఇంటిల్లిపాదినీ పట్టిపీడిస్తున్న మలేరియా

ఈ చిత్రంలో ఒకే మంచంపై వైద్యసేవలు పొందుతున్న ముగ్గురు చిన్నారులదీ ఒకే కుటుంబం. వారికి సపర్యలు చేస్తున్న మహిళ పిల్లలే వీరంతా. ఆమె పేరు మండంగి నిరోష. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి పంచాయతీ పరిధిలోని మొరమగూడ గ్రామం. తొలుత ఆమెకు మలేరియా పాజిటివ్ వచ్చింది. భద్రగిరి సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతోంది. ఇంతలోనే ఆమె కుమారుడు వినయ్‌కు మూడురోజుల కిందట, కుమార్తెలు ప్రియాంక, కల్పన రెండు రోజుల కిందట జ్వరం బారిన పడ్డారు. వైద్యపరీక్షలు చేస్తే మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అందరూ ఒకే ఆస్పత్రిలో, ఒకే మంచంపై వైద్యసేవలు పొందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని, స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదని, దోమ తెరలు ఇచ్చేవారే లేరంటూ నిరోష వాపోయింది.





పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారులు

దోమతెరలు అందించలేదు



దోమలు కుట్టడంతో మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. 2020లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దోమతెరలు అందించారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంలేదు. గిరిజనులు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడంలేదు.

– కొండగొర్రి సంతోష్, బబ్బి

పారిశుద్ధ్యం లోపించింది



మా గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. కాలువలు సరిగా లేవు. రక్షిత మంచినీటి పథకం నుంచి అందిస్తున్న తాగునీరు సైతం కలుషితమవుతోంది. రోగాలబారిన పడుతున్నాం.

– ఉలక రవికుమార్, వనిజ

అన్నదమ్ముల మధ్య మద్యం చిచ్చు

- మద్యం సేవించి వస్తుండగా ఇద్దరి మధ్య గొడవ
- అన్నపై కత్తితో తమ్ముడి దాడి
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి
- కొత్తబగ్గాంలో దారుణం
- కేసు నమోదుచేసిన పోలీసులు



ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందిన పసుపురెడ్డి శ్రీను

గజపతినగరం రూరల్: మద్యం మహమ్మారి అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టింది. ఆ మత్తులో కత్తితో దాడికి ఉసికొల్పింది. ఒకరి హత్యకు కారణమైంది. గజపతినగరం మండలం కొత్తబగ్గాంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో అన్నపై తమ్ముడు కత్తితో దాడిచేయడంతో మృతిచెందిన ఘటన కలకలం రేపింది.

ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పసుపురెడ్డి శ్రీను, చంటి అన్నదమ్ములు. ఇద్దరి మధ్య ఏడేళ్ల నుంచి మాటలు లేవు. మంగళవారం రాత్రి అన్నదమ్ములిద్దరూ తమ స్నేహితులతో కలిసి మద్యం సేవించారు. అందరూ కలిసి ఇంటికి వస్తుండగా మద్యం మత్తులో చంటిని శ్రీను వ్యంగంగా విమర్శించాడు. ఇది ఇద్దరి మధ్య గొడవకు దారితీసింది. ఆ క్రమంలో శ్రీనుపై చంటి కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన శ్రీనును గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న శ్రీను కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అదుపుతప్పి బోల్తా పడిన లారీ

బొండపల్లి: మండలం కేంద్రంలో జాతీయ రహదారి 26పై మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ ఐరన్ ఓర్ లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వెళుతూ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి పెద్దప్రమాదం జరగక పోవడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వట్టిగెడ్డలో గల్లంతైన రైతు మృతి

సాలూరు రూరల్: మండలంలోని దుద్ది సాగరం గ్రామానికి చెందిన మంచాల రామయ్య (45) వట్టిగెడ్డలో సోమవారం సాయంత్రం గల్లంతైన విషయం తెలిసిందే. అయితే మంగళవారం రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గెడ్డలో గాలించగా గ్రామ సమీపంలోని తుప్పల్లో మృతదేహం దొరికిందని రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గౌరునాయుడు మృతదేహం

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామానికి చెందిన చప్ప గౌరు నాయుడు (32) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తామరాపల్లి నుంచి కాలినడకన గింజేరు జాతీయ రహదారిపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

లాటరీ విధానంలో బార్ కేటాయింపు

పార్వతీపురం రూరల్: లాటరీ విధానంలో సాలూరులోని ఒక బార్‌ను కేటాయించారు. నాలుగు దరఖాస్తులు రావడంతో బార్ కేటాయింపునకు కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో మంగళవారం లాటరీ తీశారు. బార్‌ను సాలూరుకు చెందిన రుంకాన నరేష్ దక్కించుకున్నట్టు ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు తెలిపారు.

కొట్లాట కేసు నమోదు

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి గ్రామంలో జగనన్న కాలనీలో పక్కపక్కనే ఉంటున్న రెండు ఇళ్లకు సంబంధించిన విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ ఇద్దరు ఇళ్ల యజమానుల మధ్య కొట్లాట జరిగింది. ఫిర్యాదు చేసేందుకు సంబంధిత విద్యుత్ సిబ్బందిని కలవలేదనే కారణంతో ఆ ఇద్దరు పరస్పర వాగ్వాదంతో ఘర్షణకు దిగి కొట్లాటకు దిగారు. దీంతో ఒకరికి తలపై బలమైన గాయం కావడంతో ఫిర్యాదు మేరకు కొట్లాట కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు.

అర్జీదారుల సమస్యలు అర్థం చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్
- పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: తమ సమస్యలు, బాధలు తీరుతాయనే అర్జీదారులు పీజీఆర్ఎస్‌కు వస్తారని, వాటిని అర్థం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన సేవ అని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. అర్జీదారుల పట్ల సానుకూలంగా వ్యవహారం ఉండాలని దరఖాస్తులో వాస్తవికత ఉంటే పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా అర్జీల పరిష్కారం ద్వారా ఒకరి సమస్య తీర్చడమే నిజమైన సేవగా భావించాలని హితవు పలికారు. అర్జీలకు సమాధానాలు రాసేటప్పుడు స్పీకింగ్ ఆర్డర్ మాదిరి ఉండాలని ఏది అడిగారో దానికోసమే సమాధానం రాయాలని అయితే సమాధానం రాసిన తర్వాత అర్జీదారు సంతృప్తి చెందేలా ఉండాలని ఎట్టి పరిస్థితిల్లోనూ రీ ఓపెన్ కాకూడదని తెలిపారు.

బాధ్యత గల ఉద్యోగిని కలెక్టరేట్‌కు పంపాలి

అర్జీలను ఎలా పరిష్కరించాలో జిల్లా అధికారులు వారి స్టాఫ్‌కు ప్రతి సమావేశంలోనూ అవగాహన కలిగించాలన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రతి కార్యాలయం నుంచి ఒక బాధ్యత గల ఉద్యోగిని డిజిగ్నేట్ చేసి వారిపేరును కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. ఆర్జీల కోసం ప్రతి రోజు లాగిన్‌లో చూడాలని అలాగే సాయంత్రం వెళ్లేటప్పుడు కూడా చూడాలని తెలిపారు. ఏ టైమ్‌లో నైనా చూడకుండా ఉన్న అర్జీలు సున్నా కనపడాలని స్పష్టం చేశారు. అర్జీ అందగానే అర్జీదారుతో ముందు మాట్లాడాలని తన సమస్య ఏంటో తెలుసుకుని సమాధానం రాయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా ఉంటే ఆ అధికారి సీఆర్‌లో నెగటివ్‌గా రాయనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో అధనపు ఎస్పీ సౌమ్యలత, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళి, జిల్లా అధికారులు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల నిరీక్షణ

- ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు
- ఇంకా అమలు కాని హామీ
- ఆశగా ఎదురు చూస్తున్న యువత



నిరుద్యోగ భృతి కోసం ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

రామభద్రపురం: ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ప్రతి ఇంటికో ఉద్యోగం, లేదా నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో బాగంగా సూపర్ సిక్స్‌లో పథకాల్లో నిరుద్యోగ భృతిని మొదటి హామీగా పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా..ఈ హామీ ఇంకా అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఇంట్లో నిరుద్యోగులు చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారా? అసలు చేస్తారా? చేయరా? చేస్తే ఎప్పటి నుంచి అమలు చేస్తారు? ఇంటికో ఉద్యోగం ఇస్తారా? ఒకవేళ నిరుద్యోగ భృతి ఎంత ఇస్తారు? వంటి సందేహాలతో యువత సతమతమవుతున్నారు.అసలు ఎప్పుడు వస్తుందోనని ఆశతో ఎదురు చూస్తున్నారు.

సందిగ్ధంలో నిరుద్యోగులు..

2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పుడు కూడా ఎన్నికల ప్రచారంలో జాబు కావాలంటే..బాబు రావాలి,ఇంటికో ఉద్యోగం లేదంటే ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలిచ్చింది. కానీ ఎక్కడా ఆ హామీ కార్యరూపం దాల్చలేదు.ఇంటికో ఉద్యోగం మాట దేవుడెరుగు కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మొండిచేయి చూపారు. గత అనుభవంతో ఈ సారైనా హామీ అమలు చేస్తారా? లేదా మొండి చెయ్యి చూపిస్తారా? అనే సందిగ్ధంలో నిరుద్యోగులు ఉన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుతో సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులకు కార్యదర్శులు, వలంటీర్లుగా నియమించిన విషయం తెలిసిందే. మరి చంద్రబాబు ప్రభుత్వం ఏమేరకు ఉద్యోగాలు కల్పిస్తుందోనని యువత ఆశగా ఎదురు చూస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో వేలాది మంది ఉన్నత చదువులు అభ్యసించారు. నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు.కూటమి ప్రభుత్వం నేటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ పాలనపై గుర్రుగా జనసైనికులు

- రాష్ట్రంలో పార్వతీపురంలోనే ఎక్కువ అవినీతి
- బడిదేవర కొండపై స్థానిక ఎమ్మెల్యే తీరు విడ్డూరం
- విలేకరుల సమావేశంలో ఎండగట్టిన జనసేన ఇన్‌చార్జ్ ఆదాడ



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు ఆదాడ మోహనరావు

పార్వతీపురం రూరల్: ఎన్నికల సమయంలో తామంతా ఒక్కటే. తమ ఎజెండా ఒక్కటే అంటూ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చి తీరా ఏడాదిన్నర గడవక ముందే జనసేన నాయకులు బహిరంగంగా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి మరీ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, జిల్లాస్థాయి అధికారుల తీరుపై ప్రజల తరఫున జనసేన ప్రశ్నిస్తుందంటూ ఎండగడుతున్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ ఆదాడ మోహనరావు ఆ పార్టీ అధినేత జన్మదినాన్ని పురస్కరించుకుని కొన్ని కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ స్థానిక నియోజకవర్గ పాలకుల తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే పార్వతీపురంలో అత్యంత అవినీతి పాలన సాగుతోందని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఆరు నెలల క్రితం బడిదేవరకొండ అనుమతులు రద్దుచేయాలని తాము పోరాటం చేస్తే ఆరు నెలల తరువాత స్థానిక ఎమ్మెల్యేకు బడిదేవరకొండ సమస్య గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. కంపెనీ యాజమాన్యంతో ఇంతవరకు సఖ్యంగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే విజయచంద్రకు ఇప్పుడు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తుకు రావడం మరింత ఆశ్చర్యకరమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

పార్వతీపురంలో చెరువులు అక్రమాలకు గురైతే ఎన్నోమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పత్రికా ముఖంగా నిలదీశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపాల్టీ ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయలేని దుస్థితిలో జిల్లా యంత్రాంగం, పాలకులు ఉన్నారన్నారు. ఏడాదిన్నరలో మంజూరైన నిధులు ఏం చేశారో తెలియడం లేదని ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఇకమీదట పార్టీ అధినేత ఆదేశాలకోసం ఎదురు చూడమని, ఇకనుంచి దోపిడీ పాలనపై ప్రశ్నిస్తామని మోహనరావు స్పష్టం చేశారు.

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- ఎస్‌హెచ్‌ఓలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్



ఎస్‌హెచ్‌ఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌తో ఎస్పీ మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలను జారీ చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం నమోదై, దర్యాప్తులో ఉన్న గంజాయి కేసులపై ఎస్పీ వకుల్ జిందల్ సమీక్ష చేశారు. దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకుని కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పరారీలో ఉన్న నిందితుల గురించి సమాచారం సేకరించాలని, వారి ఆచూకీని గుర్తించేందుకు సాంకేతికతను వినియోగించాలని సూచించారు. అవసరమైతే ఆయా కేసుల్లో ప్రెసిడెన్సీ పాస్‌పోర్టు తీసుకుని, ఇతర రాష్ట్రాలకు పోలీసు బృందాలను పంపాలని అధికారులను ఆదేశించారు. తరచూ ఇదే తరహా నేరాల్లో అరెస్టు అవుతున్న నిందితులపై హిస్టరీ షీట్లు ప్రారంభించి, వారి కదలికలపై నిఘా పెట్టాలని చెప్పారు. నిందితులు ఇతర ప్రాంతాలకు చెందిన వారైతే వారి హిస్టరీ షీట్లను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేయాలన్నారు. ఎన్డీపీఎస్‌కు అనుకూలంగా ఉన్న కేసుల్లో అనుమతులు పొంది నిందితులను ముందస్తుగా అరెస్టు చేయాలన్నారు.

నిందితుల ఆస్తులు అటాచ్ చేయాలి

గంజాయి వ్యాపారంతో అక్రమంగా సంపాదించిన వారి ఆస్తులను గుర్తించి, ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, వారి అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. గంజాయితో పట్టుబడిన కేసుల్లో గంజాయి రవాణాకు పాలపడిన వ్యక్తులతోపాటు, వారికి గంజాయిని సరఫరా చేసిన వ్యక్తులు, విక్రయించిన వ్యక్తులను, ఇతర ప్రధాన నిందితులను కూడా ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చాలని తెలిపారు. నాన్ బెయిలబుల్ వారంట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని ఎగ్జిక్యూట్ చేసేందుకు సిబ్బందిని నియమించాలని చెప్పారు. రాబోయే లోక్ అదాలత్‌లలో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగులో ఉన్న గంజాయి కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలను దాఖలు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.ఈ జూమ్ కాన్ఫరెన్సులో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. గత నెల 30,31 తేదీల్లో ప.గో జిల్లా భీమవరంలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పారు. అంతర్ జిల్లాల పోటీల్లో కె.హిమశ్రీ, పి.తేజస్విని, టి. యమున సిల్వర్ మెడల్స్ సాధించగా..వి.కేసరి డి.ధరహాసిని, టి.భానుమతి బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను కోచ్ డీవీ చారిప్రసాద్, ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్, సతీష్‌కుమార్‌లు అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సేవలు శ్లాఘనీయం

విజయనగరం క్రైమ్:



రిటైర్ అయిన హోం గార్డ్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా సుదీర్ఘ కాలం సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన వారికి ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం 'ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ హోంగార్డుల సేవలను కొనియాడి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా, క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులు కె.సూర్యనారాయణ, ఎం.వెంకట రామకృష్ణారావులను పోలీసుశాఖ తరఫున ఎస్పీ వకుల్ జిందల్ మనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ తరువాత ఇకపై ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులకు ఎస్పీ సూచించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన గార్డుల దంపతులను జిల్లా పోలీసుశాఖ తరఫున ప్రత్యేకంగా అభినందించి, శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆర్.రమేష్ కుమార్, ఇనార్జ్ హెచ్సీ రాజు, హోంగార్డ్స్, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మన్నరావు



బలరాం(ఫైల్)

సీతంపేట: మండలంలోని కొత్తగూడ పంచాయతీ వంబరెల్లి నాయుడుగూడ గ్రామానికి చెందిన సర్వేయర్ సవర బలరాం (31) ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీడిచెట్టుకు ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, గ్రామస్తులు తెలిపారు. గొయిది గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తున్న ఆయనకు జూలైలో భామిని మండలం బత్తిలి వన్ గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యింది. ఇటీవల ఆర్థికపరమైన సమస్యలు రావడంతో మనస్తాపానికి గురై ఇంటిపక్కనే ఉన్న జీడితోటలోకి వెళ్లి ఉరివేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు అనీష, చారుమతి ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో గుండెలవిసేలా కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. బలరాం బలవన్మరణానికి పాల్పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై వై.అమ్మన్నరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సమాచార శాఖ ఎ.డిగా గోవిందరాజులు



పి.గోవిందరాజులు, డీపీఆర్‌ఓ

విజయనగరం అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకుడిగా పి.గోవిందరాజులు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా డీపీఆర్‌ఓగా, డివిజనల్ పీఆర్‌ఓగా, ఇన్‌చార్జ్ డీపీఆర్‌ఓగా కూడా పనిచేస్తున్నారు. తాజాగా ఇక్కడికి పదోన్నతిపై రానున్నారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

- జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

డెంకాడ: బాల్య వివాహాలు చేయడం నేరమని, చేసిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తారని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని పెదతాడివాడ గ్రామంలో యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా బాల్య వివాహాల కేసులు నమోదు కావడం దురదృష్టకరమన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి, చేయించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. న్యాయ సహాయం కోసం పేదలు జిల్లా న్యాయ న్యాయసేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. బాలలు పాఠశాలలో ఉండాలని, వారిని పనిలో ఉంచితే బాలకార్మిక చట్టాల ప్రకారం నేరమన్నారు. వీటిపై కూడా కేసులు నమోదు చేస్తారని చెప్పారు. పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమాల్లో బెజ్జిపురం యూత్‌క్లబ్ కోఆర్డినేటర్ ఝాన్సీ, సచివాలయ కార్యదర్శి అప్పలనాయుడు, వివిధ విభాగాల అధికారులు, గ్రామపెద్దలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹141	₹252	₹262

గెడ్డలో పడి వ్యక్తి మృతి



రమేష్ మృతదేహం

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని కొండవీధికి చెందిన కారంగి రమేష్(42) గెడ్డలో పడి మృతిచెందాడు. మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలోని గెడ్డలో చేపల వేటకు వెళ్లిన రమేష్ ప్రమావశాత్తు కాలు జారి నీటిప్రవాహంలో కొట్టుకుపోయాడు. సోమవారం రాత్రి సయమంలో ప్రమాదం జరగడంతో గమనించిన సహచరులు బయటకు తీసి మరణించినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ప్రయోగమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పైడితల్లి జాతర పనులు పూర్తి చేయాలి

విజయనగరం: పైడితల్లి జాతర ఏర్పాటు పనులను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమై మాట్లాడారు. ప్రధానంగా నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, దీనిలో భాగంగా నగరవ్యాప్తంగా ఉన్న డివైడర్ల గ్రిల్స్‌కు రంగుల అద్దే పనిని శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడా వీధిదీపాల సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరమత్తులకు గురైన వీధి దీపాలను తక్షణమే సరిచేయాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విపణికల్ప ప్రాంతంలోని కార్పొరేషన్ స్థలాన్ని చదును చేసి విజయనగర ప్రముఖుల వివరాలతో కూడిన చిత్రమాలికను(ఫొటో ఎగ్జిబిషన్) ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పలు ప్రాంతాలలోని గోడలకు చిత్రాలతో కూడిన పెయింటింగ్ వేయించాలన్నారు. సమావేశంలో ఎంఈ ప్రసాదు, ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

భూగర్భ జలాల స్థాయి జిల్లాలో పెరగాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో భూగర్భ జలాల స్థాయిని పెంచే మార్గాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భూగర్భ జలాల స్థాయిలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు దోహద పడే ఉపాధి హామీ పథకం ద్వారా చెక్ డ్యాంలను, ఫారం పాండ్స్‌ను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. అందుకు అవసరమయ్యే మంజూరులను తీసుకుని ప్రతిపాదనలను పంపాలని చెప్పారు. జిల్లాలో 3 మీటర్ల లోపల 17 మండలాల్లో, 3 నుంచి 8 మీటర్లలోపు 9 మండలాల్లో, 8 మీటర్ల లోతులో 2 మండలాల్లో భూగర్భజలాల స్థాయి ఉందన్నారు. అయితే జిల్లా సరాసరి 3.80 మీటర్లలోపు ఉంటుందన్నారు. రాష్ట్రంలో బాపట్ల సరాసరి 3.7 మీటర్ల లోతులో ఉంటూ మొదటి స్థానంలో ఉందని, విజయనగరం 2వ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 215 గ్రామాల్లో భూగర్భ నీటి స్థాయి తక్కువగా ఉన్నట్లు గుర్తించామని ఈ గ్రామాల్లో భూగర్భ నీటిస్థాయిని పెంచడానికి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. జలవనరుల శాఖ ద్వారా మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లను క్లీనింగ్ చేయాలని వచ్చే 4 రోజుల్లో 174 చెరువులను పరిశుభ్రం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, ఇరిగేషన్ ఈఈ రమణ, గ్రౌండ్ వాటర్ డీడీ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిందాల్ సమస్యలపై గ్రామసభ

జిందాల్ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎస్.కోట మండలం మూల బొడ్డవర గ్రామంలో బుధవారం కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వద్ద నున్న డాక్యుమెంట్ల ఆధారాలతో గ్రామ సభకు హాజరు కావాలని సూచించారు. న్యాయపరంగా రికార్డు పరంగా కచ్చితంగా ఉన్న వారికి అక్కడికక్కడే పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. లేని వారికి కారణాలను తెలియజేయనున్నామని పేర్కొన్నారు. ఈ గ్రామ సభకు తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు రికార్డులతో హాజరవుతారని అదేవిధంగా జిందాల్ కంపెనీ వారు కూడా రికార్డులతో హాజరవుతారని కలెక్టర్ తెలిపారు.